క్లుప్తంగా

ఏనాడూ జరగని అభివృద్ధిని చూశాం

● ఎమ్మెల్యే శంబంగికి నాయుడు కాలనీ వాసుల సత్కారం



ఎమ్మెల్యే శంబంగిని సత్కరిస్తున్న నాయుడు కాలనీ వాసులు

బొబ్బిలి: దాదాపు మూడు దశాబ్దాల కిందట ఏర్పడిన నాయుడు కాలనీలో రోడ్లు, కాలువల నిర్మాణాలతో పాటు మౌలికసదుపాయాలు కల్పించిన ఘనత ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడుదేనని బొబ్బిలిలోని నాయుడు కాలనీవాసులు అన్నారు. ఉద్యోగులు, పట్టణ ప్రముఖులు నివసించే కాలనీలో ఏనాడూ జరగని అభివృద్ధి జరిగిందని పేర్కొన్నారు. ఎమ్మెల్యేను, ఆయన సోదరుడు శంబంగి వేణుగోపాలనాయుడుని బుధవారం సాయంత్రం సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంబంగి మాట్లాడుతూ ఎల్లవేళలా మీకు అందుబాటులో ఉంటానని, కాలనీను మరింత అభివృద్ధి చేసేందుకు సిద్ధంగా ఉన్నట్టు వెల్లడించారు.

28న మండల సమావేశం

బాడంగి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 28న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఆంజనేయులు బుధవారం తెలిపారు. ఎంపీపీ భోగి గౌరి అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, జెడ్పీటీసీ పెద్దింటి రామారావు గౌరవ సభ్యులుగా పాల్గొంటారన్నారు. మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధశాఖల అధికారులు తప్పకుండా హాజరుకావాలని కోరారు.

నేడు బాడంగిలో జగనన్న ఆరోగ్య సురక్ష

బాడంగి: మండల కేంద్రమైన బాడంగిలో హైస్కూల్ వద్ద గురువారం ఉదయం 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జెడ్పీటీసీ పెద్దింటి రామారావు, వాడాడ పీహెచ్‌సీ వైద్యాధికారి ఆదిత్య బుధవారం తెలిపారు. వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉద్దంగిలో..

మెంటాడ: మండలంలోని ఉద్దంగి గ్రామంలో గురువారం 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ త్రివిక్రమ్ తెలిపారు. ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు.

తహసీల్దార్‌గా సులోచన రాణి

రామభద్రపురం: మండల తహసీల్దార్‌గా ఎ.సులోచన రాణి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇంతవరకు తహసీల్దార్‌గా పనిచేసిన ఎస్.రాజారావుకు వేరే ప్రాంతానికి బదిలీ కావడంతో సంతకవిటి మండల తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన సులోచన రాణి బదిలీపై ఇక్కడకు వచ్చారు.

చెత్త సేకరణ, కంపోస్టు తయారీపై ఆరా..

రాజాం: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణ సక్రమంగా ఉండాలని ఎంపీడీఓ బాసూరి శంకరరావు అన్నారు. మండలంలో సోపేరు గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని బుధవారం పరిశీలించారు. సంపదతయారీ కేంద్రాల వద్ద కూరగాయలు సాగుచేసి, కంపోస్టును ఎరువుగా వినియోగించాలని క్లాప్ మిత్రులకు సూచించారు. ఆయన వెంట ఈఓపీఆర్డీ వావిలపల్లి శ్రీనివాసరావు, గ్రామ సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

వరిపంట పరిశీలన



ఎండిపోయిన వరి పొలాలను పరిశీలిస్తున్న ఏఓ శిరీష

బాడంగి: వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పంటలకు వివిధ రకాల తెగుళ్లు సోకే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి శిరీష అన్నారు. బాడంగిలో సాగుచేస్తున్న వరి పొలాలను బుధవారం ఆమె పరిశీలించారు. నీటిఎద్దడిని నుంచి పంటను కాపాడుకునేందుకు 13-0-45 మల్టీ-కె మందును ఎకరానికి 2 కిలోల చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలని రైతులకు సూచించారు. అలాగే ప్రస్తుతం వరి పంటను ఆకుముడత, పాము పొడ తెగుళ్లు ఆశిస్తున్నందున వాటి నివారణకు 2 గ్రాముల కార్టాప్ హైడ్రోక్లోరైడ్ మందును ఒక లీటరు నీటిలో లేదా, క్లోరానైట్రానిప్రోల్ 60 మిల్లీ గ్రాముల మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు.

ఉపాధి నిధులతో కందకాల ఏర్పాటు

బొబ్బిలి: పండ్లతోటలు సాగుచేస్తున్న రైతులు చెట్ల చుట్టూ కందకాలు తవ్వేందుకు ఉపాధి హామీ పథకం కింద పనులు మంజూరు చేస్తామని ఏపీడీ జనార్దనరావు అన్నారు. మండలంలోని కోమటిపల్లి, కింతలివానిపేట తదితర గ్రామాల్లో రింగ్ ట్రెంచ్ తవ్వకాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆసక్తి కలిగిన రైతులు దరఖాస్తు చేసుకుంటే పనులు మంజూరు చేస్తామన్నారు.

పేదలకు ఆరోగ్య భరోసా..

గ్రామస్థాయిలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలనే ఉద్దేశంతో నిర్వహిస్తున్న 'జగనన్న ఆరోగ్య సురక్ష' శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకుంటున్నారు. పెద్ద సంఖ్యలో రోగులు శిబిరాలకు తరలివచ్చి వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారు. నిపుణులైన వైద్యులు రోగులకు వివిధ రకాల వైద్య పరీక్షలు చేసి మందులు అందిస్తున్నారు. బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లోని పలు సచివాలయాల పరిధిలో బుధవారం నిర్వహించిన వైద్య శిబిరాలను ఎమ్మెల్యేలు కంబాల జోగులు, శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ పరిశీలించారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరాతీసి వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



సంతకవిటి: జీఎస్‌పురంలో రోగులకు మందులు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది



రేగిడి: చిన్నశిర్లాంలో ఆరోగ్య సురక్ష శిబిరం వద్ద ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శనను పరిశీలిస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్



తెర్లాం: లోచర్లలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ డి.రత్నకుమార్, ప్రజాప్రతినిధులు



రేగిడి: చిన్నశిర్లాంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం వద్ద రోగులకు మెడికల్ కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్



బొబ్బిలి: అలజంగిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం వద్ద ఏర్పాటుచేసిన పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

సంక్షేమ పథకాల అమలులో దేశానికే ఆదర్శం

● ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



మహిళకు సంక్షేమ లబ్ధిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

బొబ్బిలి: సంక్షేమ పథకాల అమలులో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే ముందంజలో ఉందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. మండలంలోని కోమటిపల్లిలో బుధవారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్థానిక నాయకులు, అధికారులతో కలిసి గ్రామంలోని ప్రతీ ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాల ద్వారా నాలుగున్నరేళ్లలో వారికి చేకూర్చిన లబ్ధిని వివరించారు. పథకాలు సక్రమంగా అందుతున్నాయా, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ఆరాతీశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వలంటీర్ వ్యవస్థ, సచివాలయ వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. మన రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలను దేశంలోని ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుని అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నాయన్నారు. ప్రభుత్వానికి, సీఎం జగన్‌మోహన్ రెడ్డికి వస్తున్న మంచిపేరును చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా లేనిపోని దుష్ప్రచారం చేస్తున్నాయని దుయ్యబట్టారు. చంద్రబాబు కుంభకోణం చేసి జైలుకు వెళితే 'న్యాయం గెలవాలని' ఆయన సతీమణి యాత్ర చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వాస్తవానికి అన్నీ చూస్తున్న ప్రజలు న్యాయమే గెలవాలని కోరుకుంటున్నారని, కుంభకోణాలు చేసిన వారిని కాదని స్పష్టం చేశారు. ఆ న్యాయం వైఎస్సార్‌సీపీ వైపు ఉందని ప్రజలే ముక్తకంఠంతో అంటున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శంబంగి వేణుగోపాలనాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు వంగపండు శ్రీరాములు, ఎంపీపీ శంబంగి లక్ష్మి, జేసీఎస్ మండల కన్వీనర్ తమ్మిరెడ్డి దామోదరరావు, గొట్టాపు సూర్యనారాయణ, సింహాచలం, మండల పరిషత్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి పలువురి చేరిక



గొట్టాపు అప్పారావుకు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: కోమటిపల్లి మాజీ సర్పంచ్ గొట్టాపు అప్పారావు తన అనుచరులు, కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. కోమటిపల్లి గ్రామంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు సమక్షంలో వారంతా పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే శంబంగి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా గొట్టాపు అప్పారావు మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను నాలుగున్నరేళ్లుగా చూస్తూ పార్టీ వైపు ఆకర్షితుడనై పార్టీలో చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శంబంగి వేణుగోపాలనాయుడు, జేసీఎస్ మండల ఇన్‌ఛార్జి తమ్మిరెడ్డి దామోదరరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అమ్మవారి అనుపోత్సవం

దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ముగిసాయి. మండపాల్లో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాలను బుధవారం మేళ తాళాలతో ఊరేగింపుగా తీసుకువెళ్లి సమీపంలోని చెరువులు, నదులలో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పెద్ద సంఖ్యలో భక్తులు, యువత పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



బొబ్బిలి: గొల్లపల్లిలో దుర్గాదేవి విగ్రహం ఊరేగింపు



బొబ్బిలి: గొల్లపల్లిలోని దేవీ మండపంలో ఎమ్మెల్యే శంబంగికి అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న కమిటీ సభ్యులు



రేగిడి: రేగిడిలో దుర్గాదేవి అనుపోత్సవం



రాజాం: కంచరాంలో దుర్గాదేవి అనుప పండగ నిర్వహిస్తున్న దృశ్యం



రాజాం సిటీ: లక్ష్మీపురంలో దుర్గాదేవి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

ప్రజలకు మెరుగైన సేవలందించడమే లక్ష్యం

● డీపీఓ నిర్మలాదేవి



రికార్డులు పరిశీలిస్తున్న డీపీఓ నిర్మలాదేవి

రాజాం సిటీ: ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని డీపీఓ నిర్మలాదేవి అన్నారు. మండలంలోని సోపేరు గ్రామ సచివాలయాన్ని బుధవారం ఆమె పరిశీలించారు. వివిధ పనులపై సచివాయానికి వచ్చేందుకు ఎన్నో వ్యయప్రయాసలు పడాల్సి వస్తోందని సోపేరు సచివాలయం పరిధిలోని నందబలగ, కొఠారిపురం గ్రామస్తులు ఇటీవల నిర్వహించిన స్పందనలో ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టేందుకు వచ్చిన డీపీఓ ఆయా గ్రామాల ప్రజలతో సమావేశమై గ్రామస్తుల అభిప్రాయాలు సేకరించారు. సచివాలయ సిబ్బంది ఒక్కో గ్రామంలో రెండు రోజుల చొప్పున అందుబాటులో ఉండేలా చూడాలని వారంతా కోరారు. దీనిపై స్పందించిన డీపీఓ ప్రజాభిప్రాయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. అనంతరం సచివాలయ రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎంపీడీఓ బాసూరి శంకరరావు, ఈఓపీఆర్డీ వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అవసరమైన పనులు గుర్తించాలి

రాజాం సిటీ: గ్రామాల్లో 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి నిధులతో చేపట్టేందుకు ప్రజలకు అవసరమైన పనులను గుర్తించాలని ఎంపీడీఓ బాసూరి శంకరరావు అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బందికి బుధవారం ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పనుల గుర్తింపు, అంచనాల తయారీ, లేబర్ బడ్జెట్ తయారీ, ప్లాంటేషన్ వంటి 97 రకాల పనులకు సంబంధించిన పలు అంశాలను వివరించారు. ఉపాధి వేతనదారులకు శతశాతం పనులు కల్పించేందుకు ప్రతీ గ్రామ పంచాయతీలో నిర్దిష్టమైన సమాచారం నమోదుచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ కె.సాయిరాం, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

రేగిడి: గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి ప్రజలకు, రైతులకు అవసరమైన పనులను గుర్తించాలని ఏపీడీ ఎం.శ్రీనివాసరావు సిబ్బందికి సూచించారు. ఉపాధిహామీ కార్యాలయంలో బుధవారం సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి పనుల గుర్తింపునకు గ్రామాల్లో దండోరా వేయించి, ప్రజల నుంచి వివరాలు సేకరించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఓ హరనాథరావు, డీఆర్పీ కోటి, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు



సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

● ఎమ్మెల్యే కంబాల జోగులు

సంతకవిటి: పార్టీలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతీ కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. మండలంలోని జావాం గ్రామంలో బుధవారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జోగులు స్థానిక నాయకులు, అధికారులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. సంక్షేమ పథకాల ద్వారా ఈ నాలుగున్నరేళ్లలో ఒక్కో కుటుంబానికి చేకూర్చిన లబ్ధిని వివరిస్తూ బుక్‌లెట్లు అందజేశారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. గతంలో ఏ ప్రభుత్వమూ అమలు చేయనన్ని పథకాలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని వివరించారు. గతంలో టీడీపీ ప్రభుత్వం తమ పార్టీ కార్యకర్తలకు మాత్రమే పథకాలు అందించేదని, నీరు-చెట్టు కార్యక్రమం పేరుతో రాష్ట్ర ఖజానా కాజేసిందని ఆరోపించారు. టీడీపీకి మళ్లీ అవకాశం ఇస్తే ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలన్నీ కనుమరుగవుతాయని అన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి, మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు, సర్పంచ్ బి.ప్రసాద్, స్థానిక నాయకులు కర్నేన రామకృష్ణం నాయుడు, రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ గురుగుబల్లి స్వామినాయుడు, జేసీఎస్ కన్వీనర్ ఆర్.రమేష్‌నాయుడు, ఎంపీడీఓ రవికుమార్, వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి జూడో పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం భాస్కరరావు, తదితరులు

రామభద్రపురం: అనంతపురం జిల్లా చిగిచెర్లలో ఈ నెల 28, 29, 30 తేదీలలో జరగనున్న రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ జూడో పోటీలకు కొట్టక్కి ఉన్నత పాఠశాల నుంచి 10 మంది విద్యార్థులు ఎంపికైనట్లు వ్యాయామోపాధ్యాయుడు రత్నకిషోర్ బుధవారం తెలిపారు. అండర్-14 విభాగంలో జె.పల్లవి, ఆర్.మౌనిక, ఎస్.ఉమామహేశ్వరరావు, ఎం.కోటేశ్వరరావు, జి.తులసి ఎంపికవగా, అండర్-17 విభాగంలో సీహెచ్ కుసుమ, అండర్-19 విభాగంలో ఎస్.నీలిమ, ఎం.దీపిక, ఎస్.సంధ్య, వి.చంద్రశేఖర్ ఎంపికైనట్లు వెల్లడించారు. వారంతా ఇటీవల ఆరికతోటలో నిర్వహించిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ జూడో పోటీలలో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. వారిని జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి, సర్పంచ్ అప్పికొండ అనురాధ, హెచ్ఎం రావాడ భాస్కరరావు అభినందించారు.

ప్రాధాన్యత పనులు గుర్తించాలి

రామభద్రపురం: రానున్న ఆర్థిక సంవత్సరంలో ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టేందుకు రైతులు, ప్రజలకు ఉపయోగపడే పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీడీఓ రమామణి అన్నారు. ఉపాధి పనుల గుర్తింపు, ప్రాధాన్యత, ప్రణాళికల తయారీపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏపీఓ హరినాథ్‌తో కలిసి బుధవారం ఉపాధి క్షేత్రసహాయకులు, సాంకేతిక సహాయకులకు దిశానిర్దేశం చేశారు. గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి ప్రజలకు, రైతులకు ఉపయోగపడే పనులు గుర్తించాలన్నారు. ప్రధాన్యతక్రమంలో పనులు చేపట్టేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలన్నారు.

స్కూటీ కాల్చిన ఘటనలో కేసునమోదు

రాజాం సిటీ: స్థానిక చిన్నచెరువు గట్టు వీధిలో ఈ నెల 24న అర్ధరాత్రి స్కూటీ కాల్చిన ఘటనపై కేసు నమోదుచేశామని ఎస్సై వై.రవికిరణ్ బుధవారం తెలిపారు. చిన్నచెరువు గట్టువీధికి చెందిన మహిళ దమరసింగి నారాయణ స్కూటీని పాతకక్షల నేపథ్యంలో సారధి గ్రామానికి చెందిన కిలారి త్రినాథ్ పెట్రోల్ పోసి కాల్చివేయడంతో పాక్షికంగా కాలిపోయింది.

బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

గ్రామ సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం

● ఎమ్మెల్యే జోగులు



గ్రామ సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

సంతకవిటి: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. మండలంలోని జావాం గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సేవలు ప్రజలకు చేరువయ్యాయన్నారు. మండల కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఉన్న ఊర్లోనే సేవలు అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్‌మోహన్‌రావు, సర్పంచ్ బి.ప్రసాద్, స్థానిక నాయకులు కర్నేన రామకృష్ణనాయుడు, రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ గురుగుబల్లి స్వామినాయుడు, జేసీఎస్ కన్వీనర్ ఆర్.రమేష్‌నాయుడు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

● భక్తిశ్రద్ధలతో ఇరుముడులు



రాజాం: కంచరాం నుంచి ఇరుముడితో కాలినడకన నవదుర్గామాత ఆలయానికి బయలుదేరిన భక్తులు



సంతకవిటి: జావాంలో భవానీ స్వాముల ఇరుముడి కార్యక్రమం



రేగిడి: తాటిపాడులో ఇరుముడితో భవానీ భక్తులు



బొబ్బిలి: పట్టణంలోని అయ్యప్ప ఆలయం వద్ద భక్తులకు మాలాధారణ చేస్తున్న గురుస్వాములు

భవానీ మాలధారణ భక్తులు అమ్మవారికి ఇరుముడులు సమర్పించేందుకు సిద్ధమయ్యారు. అర్ధమండల, నవరాత్రి దీక్షలు పూర్తవడంతో ఆయా గ్రామాల్లోని ఆలయాల వద్ద బుధవారం భక్తిశ్రద్ధలతో ఇరుముడి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వారంతా గ్రామ ప్రదక్షిణ చేసి విజయవాడ కనకదుర్గమ్మకు ఇరుముడులు సమర్పించేందుకు బయలుదేరి వెళ్లారు. మరోవైపు అయ్యప్ప భక్తులు మండల దీక్షలకు సిద్ధమవుతున్నారు. పలు గ్రామాల్లో గురుస్వాములు అయ్యప్ప భక్తులకు మాలధారణ చేశారు.

– సాక్షి నెట్‌వర్క్

వంట సామగ్రి పంపిణీ

రాజాం: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయం వద్ద బుధవారం మండలంలో పలు ప్రభుత్వ పాఠశాలలకు ఎండీఎం వంట సామాగ్రి పంపిణీ చేశారు. ఎంపీపీ లావేటి సులోచన చేతులమీదుగా సామగ్రిని ఆయా పాఠశాలల హెచ్ఎంలకు ఎంఈఓలు బి.ప్రవీణ్‌కుమార్, యాగాటి దుర్గారావు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాజాం రూరల్ కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ బండి నర్సింహులు, వంజరాపు విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వంగర: స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం వద్ద ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ చేతులమీదుగా మధ్యాహ్న భోజన వంట ఏజెన్సీలకు వంట సామగ్రిని బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కరణం సుదర్శనరావు, ఎంఈఓ పి.ప్రవీణ్‌కుమార్, కడగల పారినాయుడు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనుల పరిశీలన

బాడంగి: మండలంలోని భీమవరం, ముగడ గ్రామాల్లో ఉపాధిహామీ నిధులతో చేపట్టిన పనులను ఎంపీడీఓ ఆంజనేయులు బుధవారం పరిశీలించారు. ఉపాధి సిబ్బందికి పలు సూచనలు చేశారు. సచివాలయ సిబ్బంది పనితీరు, రికార్డుల నిర్వహణపై ఆరాతీశారు. ఆయనతో పాటు ఉపాధి ఏపీఓ విజయలక్ష్మి, ఈసీ బుజ్జి, టీఏలు, ఎఫ్ఏలు ఉన్నారు.